కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -146 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 08-06-2026 | సోమవారం | పేజీలు : 4

# విద్యార్థులకు గుడ్ న్యూస్

### స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు




**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని పాఠశాలలకు వేసవి సెలవులను మరో కొన్ని రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కొంత ఊరట పొందారు.

# ముగిసిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన

### తెరపైకి కొత్త విద్యాశాఖ మంత్రి పేరు!




**న్యూస్ డెస్క్, 06 జూన్ (బిఎన్ఎస్):** నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమం ముగిసింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇచ్చిన పిలుపు మేరకు వేలాది మంతి యువత జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం, విద్యావిధానంలోని లోపాల వల్ల మరణించిన విద్యార్థులకు ఈ సందర్భంగా సీజేపీ నివాళులు అర్పించింది. ఈ సందర్భంగా మరణించిన విద్యార్థుల పేర్లను అభిజీత్ దీప్కే చదివి వినిపించారు. కాగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ సీజేపీ 8 లక్షల సంతకాలను సేకరించింది.

**సోనమ్ వాంగ్ చుక్ మద్దతు:**

సీజేపీ చేపట్టిన నిరసన కార్యక్రమానికి ప్రముఖ సామాజిక కార్యకర్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. స్వయంగా జంతర్ మంతర్ నిరసనలో పాల్గొన్నారు.

### నదుల అనుసంధానం పేరుతో

# ఏపీ కొత్త కుట్ర

### హరీశ్ రావు సంచలన ఆరోపణలు




# కేటీఆర్ నాలెడ్జ్ ముందు నారా లోకేష్ సరిపోరు

### వెలుగులోకి షాకింగ్ నిజాలు





# నైరుతి రుతుపవనాల గమనంలో విరామాలు

### రైతులకు వాతావరణ శాఖ అధికారుల కీలక సూచనలు!

**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలు క్రమంగా విస్తరిస్తుండగా.. ఈ ఏడాది వర్షపాతం పరిస్థితులపై విపత్తుల నిర్వహణ సంస్థ కీలక అంచనాలు వెల్లడించింది. సాధారణంగా నమోదయ్యే వర్షపాతంతో పోలిస్తే.. ఈసారి కొంత తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రకర్ జైన్ తెలిపారు. అయితే స్థానిక వాతావరణ మార్పుల ప్రభావంతో కురిసే వర్షాలు ఈ లోటును కొంత మేర భర్తీ చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రయాణంలో తరచూ విరామాలు ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంటే కొన్ని రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవనుండగా.. మరికొన్ని రోజులు పూర్తిగా పొడి వాతావరణం నెలకొనే పరిస్థితులు కనిపించవచ్చు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తమ పంటల ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచించారు.




విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం.. పోలవరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. అలాగే కర్నూలు, నంద్యాల, మార్కాపురం, అనంతపురం, వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాల్లో కూడా వర్షాలు సాధారణ స్థాయి కంటే తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కూడా వర్షపాతం లోటు ఉండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఈ జిల్లాల రైతులు సాగు ప్రణాళికల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కాంగ్రెస్‌లో కొత్త కలకలం!

- మంత్రి పదవి లేదంటే రాజీనామా!
- కాంగ్రెస్‌లో మంత్రి రేసు వేడెక్కింది
- మల్‌రెడ్డి సంచలన హెచ్చరిక
- రంగారెడ్డి జిల్లాకు మంత్రి కావాలే!
- పదవి కోసం బహిరంగ డిమాండ్
- కుల సమీకరణాలపై అసంతృప్తి
- మంత్రి బెర్త్ కోసం పోటీ తీవ్రం
- హైకమాండ్‌కు కొత్త సవాల్
- కేబినెట్ విస్తరణపై ఉత్కంఠ
- కాంగ్రెస్‌లో ఆశావహుల హడావిడి
- తెలంగాణ రాజకీయాల్లో కలకలం
- పదవుల పంచాయితీ మళ్లీ మొదలు
- మంత్రి సీటుపై ఎమ్మెల్యే ఫైర్
- కాంగ్రెస్‌లో అంతర్గత ఒత్తిడి
- కీలక మార్పులకు రంగం సిద్ధం



**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** కర్ణాటకలో సీఎం మార్పు తర్వాత కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణపై దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా త్వరలోనే మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రభుత్వంలో కీలక మార్పులు ఉండబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో మంత్రి పదవి ఆశిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడిన ఆయన రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనన్నారు. నాకు మంత్రి పదవి అడగడంలో తప్పేం ఉందని ప్రశ్నించారు. మంత్రి పదవి కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు నేనూ రేసులో ఉన్నట్లు చెప్పారు. మిగిలిన వాళ్లు ప్రయత్నం చేయడం వాళ్ల పరిధిలోని అంశం అని చెప్పారు. తనకు మంత్రి పదవి ఇవ్వడానికి కుల సమీకరణాలు అడ్డొస్తే నేను రాజీనామా చేసి త్యాగం చేయడానికైనా సిద్ధం అన్నారు. శనివారం సభ విజయవంతంతో బీఆర్ఎస్ నేతల నోళ్లు మూతపడ్డాయని సీఎం సభలో ప్లకార్డులు పట్టుకోవడం తప్పు కాదని, కార్యకర్తలు వాళ్ల అభిప్రాయం చెప్పారన్నారు. మహేశ్ గౌడ్ ఎందుకు మాట్లాడారో తెలియదని నాకు ఎవరూ వార్నింగ్ ఇవ్వలేదన్నారు.

**త్వరలో కీలక మార్పులు!:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా ఇంకా పూర్తి స్థాయి కేబినెట్ ఏర్పాటు కాలేదు. ఇంకా రెండు మంత్రి పదవులు భర్తీ చేయాల్సి ఉంది. త్వరలోనే ఈ రెండు మంత్రి పదవులతో పాటు శాఖల పునర్విభజన, స్పీకర్ మార్పు, డిప్యూటీ సీఎం పోస్టులు, ప్రభుత్వ విప్‌ల విషయంలోనూ హైకమాండ్ మార్పులు చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఊహాగానాలకు బలం చేకూర్చుతూ ఇటీవలే శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలతో భేటీ కావడం తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాహుల్ గాంధీని కలిశారు. ఈ పరిణామాలతో తెలంగాణలో కీలక మార్పులు ఉండబోతున్నాయనే చర్చ జరుగుతోంది.

మిగతాది 2 లో..


# గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం

### స్టాంపు డ్యూటీ, సీనరేజ్ నిధులు నేరుగా గ్రామాలకే!




**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** గ్రామపంచాయతీలను ఆర్థికంగా పరిపుష్టిగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. నిధులు ఇవ్వడంతో పాటు అందుబాటులో ఉన్న నిధులను త్వరగా ఖర్చుచేసుకునే వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉపసర్పంచ్‌ల స్థానంలో గ్రామకార్యదర్శికి చెక్ పవర్ అప్పగించాలని నిర్ణయించింది.

# టీవీకే ప్రభుత్వంపై ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు




**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** ఎం. కే. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పార్టీ తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. ప్రస్తుత ప్రభుత్వం ఒకప్పుడు డీఎంకే కూటమిలో భాగంగా ఉన్న పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందని ఆరోపించిన స్టాలిన్, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయని, ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం వచ్చిందని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్‌లో కొత్త కలకలం!

## మంత్రి పదవి లేదంటే రాజీనామా!

మొదటి పేజీ తరువాయి



హైకమాండ్‌కు కొత్త తలనొప్పులు:

తెలంగాణలో పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ లో మంత్రి పదవుల కోసం పెద్ద ఎత్తున ఆశావహులు ఎదురు చూస్తున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని నేతలు బహిరంగంగానే డిమాండ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆశిస్తున్నవారిలో ముఖ్యమైన వారిని కెబినెట్‌లోకి తీసుకోవాలన్నా ప్రస్తుత మంత్రులకు ఉద్వాసన పలకాల్సి ఉంటుంది. దీంతో కొత్తవారికి అవకాశం ఇచ్చేందుకు ఎవరిని పక్కన పెడుతారు? ఎవరికి ప్రమోషన్ కల్పిస్తారు అనేది కీలకంగా మారింది. ఒక వేళ సామాజిక సమీకరణాల కోసం ఎవరినైనా తప్పిస్తే అది ఎలాంటి పరిణామాలకు దారి తీయబోతోంది అనేది ఉత్కంఠగా మారింది. ఇటీవల కర్ణాటకలో సిద్దరామయ్యను తప్పించి డీకే శివకుమార్ ను సీఎం చేసింది అధిష్టాం. అయితే అక్కడ కొత్త ప్రభుత్వం ఏర్పాటై వారం రోజులైనా గడవక ముందే నీటి పారుదలశాఖ మంత్రి రామలింగారెడ్డి రాజీనామా చేయడం కలకలం రేపింది. తనకు ఇష్టం లేని శాఖ కేటాయించారని అసహనం వ్యక్తం చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఈ సమస్యను తాము పరిష్కరించుకుంమని డీకే శివకుమార్ తెలిపారు. ఇది టీ కప్పులో తుపాను వంటిదేనని చెప్పారు. తెలంగాణలోనూ మంత్రివర్గ విస్తరణలో జరగబోయే మార్పులు చేర్పులతో ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాబోతున్నాయి? అవి హైకమాండ్‌కు ఎలాంటి తలనొప్పులు తీసుకురాబోతోంది అనేది తెలంగాణ కాంగ్రెస్‌లో ఆసక్తిగా మారింది.

# నదుల అనుసంధానం పేరుతో ఏపీ కొత్త కుట్ర..

## హరీశ్ రావు సంచలన ఆరోపణలు




**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో తలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు కేవలం బీఆర్ఎస్ చేసిన గట్టి పోరాటం వల్లే ఆగిపోయిందని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. తమకు రాజకీయ ప్రయోజనాల కంటే తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు. నదీ జలాల దోపిడీ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీని నిద్రలేపేందుకే తాము ఈ ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

ఏపీ కొత్త ప్లాన్.. తెలంగాణకు తీవ్ర నష్టం

గతంలో ఏపీ ప్రభుత్వం వేసిన గోదావరి–బనకచర్ల, గోదావరి–నల్లమల్ల సాగర్ వంటి రెండు ప్లాన్లు విఫలమయ్యాయని హరీశ్ రావు గుర్తుచేశారు. తాజాగా నదుల అనుసంధానం పేరుతో ఏపీ మరో కొత్త కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. దీని ద్వారా ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా, నేషనల్ ప్రాజెక్టు కింద కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గోదావరి నీళ్లను ఆంధ్రప్రదేశ్‌లోకి సులభంగా మళ్లించుకునే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఈ నదుల అనుసంధాన ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఒక్క చుక్క నీరు కూడా రాకుండా పోతుందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తెలంగాణకు చెందిన సమ్మక్క సాగర్ నుంచి 47 టీఎంసీల నీటిని కూడా పూర్తిగా వదులుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గోదావరి నదిలో అసలు మిగులు జలాలే లేనప్పుడు, ఏపీ కొత్తగా ప్రాజెక్టులు ఎలా కడుతుందని ఆయన ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌పై 'గురుదక్షిణ' ఆరోపణలు

తెలంగాణకు ఇంత పెద్ద అన్యాయం జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు 'డూడూ బసవన్నలాలా' తలలూపుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. తన రాజకీయ గురువైన చంద్రబాబు నాయుడి కళ్లల్లో ఆనందం చూడటం కోసమే రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ద్రోహం చేస్తున్నారని, గోదావరి నీళ్లను ఆయనకు 'గురుదక్షిణ'గా ఇవ్వాలని చూస్తున్నారా అని ధ్వజమెత్తారు. దీనిపై సూటిగా ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక తిట్లకు లంఘిస్తున్నారని, తాము మాత్రం ప్రశ్నించడం ఆపబోమని స్పష్టం చేశారు.

గతంలో బీఆర్ఎస్ పెట్టిన ప్రతిపాదనలు

తాము అధికారంలో ఉన్నప్పుడు నదుల అనుసంధానానికి సంబంధించి కేంద్రం ముందు కొన్ని స్పష్టమైన ప్రతిపాదనలు పెట్టామని హరీశ్ రావు గుర్తుచేశారు. నీటిని ఇచ్చంపల్లి, సమ్మక్క సాగర్ నుంచి అది కూడా తెలంగాణ భూభాగం నుంచే తీసుకోవాలి, అప్పుడే తెలంగాణ కూడా ఆ నీటిని వాడుకునే వీలుంటుందన్నారు. అందుకు పొరుగు రాష్ట్రం కర్ణాటక కూడా ఒప్పుకుందన్నారు. కావేరీ నదికి తీసుకెళ్లే నీటిలో సగం వాటాను తెలంగాణకు ఇవ్వాలని చెప్పామని, గతంలో కేంద్రం కూడా ఆ ప్రతిపాదనలకు అంగీకరించిందని తెలిపారు. కానీ ఇప్పుడు తెలంగాణను కాదని పోలవరం నుంచి నీటిని మళ్లించేలా ఏపీ సీఎం చంద్రబాబు కావేరి–గోదావరి లింక్ రాగం అందుకున్నారని, దీనివల్ల తెలంగాణకు కోలుకోలేని నష్టం జరుగుతుందని హరీశ్ రావు హెచ్చరించారు.

# గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం

## స్టాంపు డ్యూటీ, సీనరేజ్ నిధులు నేరుగా గ్రామాలకే!

మొదటి పేజీ తరువాయి




ప్రతి పైసాకు ప్రభుత్వంపై ఆధారపడటం కాకుండా గతంలో ఉన్న విధానాలను తీసుకురావాలని నిర్ణయించింది. దీనికోసం అవసరమైన చట్టసవరణ చేయాలని భావిస్తున్నది. గ్రామపంచాయతీ సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయడం కాకుండా నేరుగా గ్రామపంచాయతీ బ్యాంకు ఖాతాలో జమచేసేలా చట్టసవరణ చేయాలని నిర్ణయించింది. తద్వారా త్వరగా నిధులను డ్రా చేసుకునే అవకాశాలు ఉంటాయని, ఆ నిధులను ఖర్చు చేయడానికి, వాటిని డ్రా చేయడానికి ఎక్కువ సమయం పట్టదని అధికారులు ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్70(3)కు సవరణ చేయాలని నిర్ణయించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆమోద ముద్రవేశారు.

గతంలో ఇలా..

ఇదివరకు గ్రామ పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్లు జరిగితే సంబంధిత గ్రామపంచాయతీకి స్టాంపు డ్యూటీ ఫీజు ఖాతాలో జమ అయ్యేది. దీంతో పాటు ఇసుక, గ్రానైట్ ఇతర సినరేజ్ మొత్తం లో కొంత భాగం వచ్చేది. అయితే గత బీఆర్ఎస్‌ప్రభుత్వం వాటన్నంటిని నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి బదాలాయించుకుని కొంత మొత్తాన్ని గ్రామ పంచాయతీలకు విడుదల చేసేది. కేంద్రంతో సమానంగా రాష్ట్రం పంచాయతీలకు నిధులు ఇస్తున్నామని నాటి సీఎం కేసీఆం ప్రకటించారు. అయితే దీనిపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలను బలోపేతం చేయడం, స్వంతంత్రంగా వ్యవహరించే విధంగా వారి నిధులను వారికే బదలాయించేలా నిర్ణయం తీసుకున్నది. తద్వారా గ్రామపంచాయతీలకు పూర్వవైభవం వచ్చే నిర్ణయం తీసుకున్నది. ప్రతి దానికి ప్రభుత్వంపై అధారపడటం, ప్రభుత్వం ఇస్తేనే నిధులు ఉండటం కాకుండా స్వంతంత్రంగా వ్యవహరించే విధంగా చేయనున్నారు. దీంతోపాటు గ్రామాల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్స్, పారిశుద్ధ్య కార్మికులు, మండల, గ్రామ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాలను రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించేలా ప్రభుత్వం అనుమతిచ్చింది. తద్వారా వారికి రెగ్యులర్ గా వేతనాలు రావడం, పంచాయతీలపై అదనపు భారం తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే వేలాది మందికి నేరుగా, సమయానికి వేతనాలు అందనున్నాయి.

# విద్యార్థులకు గుడ్ న్యూస్.. స్కూళ్లకు

## వేసవి సెలవులు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి



వాస్తవానికి పాఠశాలలు జూన్ 13 నుంచి పునఃప్రారంభం కావాల్సి ఉండగా, ఆ రోజు రెండో శనివారం కావడంతో సెలవు ఉంటుంది. అలాగే జూన్ 14 ఆదివారం కూడా కావడంతో వరుసగా రెండు రోజులు సెలవులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పులు చేసింది.

తాజా నిర్ణయం ప్రకారం తెలంగాణలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జూన్ 15 నుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. దీంతో విద్యార్థులకు మరో రెండు రోజుల అదనపు సెలవులు లభించాయి. అయితే విద్యా సంవత్సరంలో పనిదినాల సంఖ్యకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జూన్ 13న రెండో శనివారం సెలవు ఇచ్చినందుకు బదులుగా జులై 11న (రెండో శనివారం) పాఠశాలలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది.

వేసవి తీవ్రత, వరుస సెలవులు, విద్యా క్యాలెండర్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. జూన్ 15 నుంచి అన్ని పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయని స్పష్టం చేశారు.

# టీవీకే ప్రభుత్వంపై ఎంకే స్టాలిన్ తీవ్ర విమర్శలు

మొదటి పేజీ తరువాయి



డీఎంకేలోకి పలువురు ఏఐఏడీఎంకే నేతలు చేరిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన స్టాలిన్, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల పూర్తి మద్దతుతో కాకుండా మాజీ మిత్రపక్షాల సహకారంతో కొనసాగుతోందని విమర్శించారు.

"మాజీ మిత్రపక్షాల మద్దతుతోనే ప్రభుత్వం"

"ప్రస్తుత ప్రభుత్వం మన మాజీ కూటమి భాగస్వాముల మద్దతుపైనే ఆధారపడి నడుస్తోంది. ఆ పార్టీలు గతంలో డీఎంకే విజయం కోసం పనిచేశాయి. వారి నాయకులు టీవీకేలో చేరాలనే ఆలోచనను కూడా నాకు వ్యక్తం చేశారు. అది వారి ప్రజాస్వామ్య హక్కు అని నేను అంగీకరించాను. ఆ సమయంలో రాష్ట్రంలో రాజకీయ అస్థిరత లేదా రాష్ట్రపతి పాలన రావాలని మేము కోరుకోలేదు" అని స్టాలిన్ పేర్కొన్నారు.

డీఎంకే తిరిగి అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం

రాష్ట్రంలో రాజకీయ సంక్షోభాన్ని సృష్టించాలనే ఉద్దేశం తమకు ఎప్పుడూ లేదని స్టాలిన్ స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మారిపోయాయని, టీవీకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లోకి వెళ్లి పోరాడాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. "త్వరలోనే డీఎంకే తిరిగి అధికారంలోకి వస్తుంది. ప్రజల ఆశీర్వాదంతో మరోసారి తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం ఏర్పడుతుంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చారిత్రాత్మక ఫలితాలు నమోదు చేసిన తమిళనాడు ఎన్నికలు

ఈ ఏడాది జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అదే సమయంలో డీఎంకే కూటమి మొత్తం 73 స్థానాలు గెలుచుకుంది. ఇందులో డీఎంకే 59, కాంగ్రెస్ 5, సీపీఐ 2, సీపీఐ(ఎం) 2, వీసీకే 2, ఐయూఎంఎల్ 2, డీఎండీకే 1 స్థానం సాధించాయి. మరోవైపు ఏఐఏడీఎంకే కూటమి 53 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏఐఏడీఎంకే 47, పీఎంకే 4, బీజేపీ 1, ఏఎంఎంకే 1 స్థానం గెలుచుకున్నాయి.


మెజారిటీ లేకపోయినా ప్రభుత్వ ఏర్పాటు

234 సభ్యుల తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 స్థానాల మెజారిటీని ఏ ఒక్క పార్టీ కూడా సాధించలేకపోయింది. దీంతో ఇతర పార్టీల మద్దతుతో టీవీకే ప్రభుత్వం ఏర్పడింది. అనంతరం విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో టీవీకే–డీఎంకే మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కుతుండగా, రానున్న రోజుల్లో తమిళనాడు రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# నైరుతి రుతుపవనాల గమనంలో విరామాలు..

## రైతులకు వాతావరణ శాఖ అధికారుల కీలక సూచనలు!

మొదటి పేజీ తరువాయి




మరోవైపు ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జిల్లాల్లో వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సాధారణ స్థాయి వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కృష్ణా జిల్లాల్లో కూడా సాధారణ వర్షపాతం కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు.

రుతుపవనాల గమనంలో మార్పులు, తక్కువ వర్షాల నేపథ్యంలో రైతులు వాతావరణ అంచనాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. పంటల ఎంపిక, విత్తనాల విత్తకం, నీటి వినియోగం వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఈ ఏడాది వర్షాల తీరు వ్యవసాయ రంగంపై కీలక ప్రభావం చూపే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# రూ.1600 కోట్ల మద్యం అక్రమాలు..

## సీఎం విజయ్ కీలక ఆదేశాలు



**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ, సీఎం జోసెఫ్ విజయ్ అవినీతిపై ఉక్కుపాదం మోపారు. గత ఐదేళ్ల డీఎంకే పాలనలో ప్రభుత్వ మద్యం విక్రయాల సంస్థ 'టాస్మాక్' హోల్‌సేల్, రిటైల్ నెట్‌వర్క్ ద్వారా దాదాపు రూ. 1,600 కోట్ల మేర భారీ మద్యం అక్రమాలు జరిగినట్లు తేలడంతో ఆయన తీవ్ర చర్యలకు ఆదేశించారు. ఈ నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా 'పార్టీ ఫండ్' పేరుతో అనధికారికంగా మళ్లించబడ్డాయని విచారణలో వెల్లడైంది. ఈ స్కామ్‌కు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే.. ప్రతి నెల సుమారు రూ. 102 కోట్లు పక్కదారి పట్టినట్లు సమాచారం. లిక్కర్ కేసుకు రూ.90, బీర్ కేసుకు రూ.40, వైన్ కేసుకు రూ.20 చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలింది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి విజయ్ తన తొలి క్యాబినెట్ సమావేశంలోనే ఈ వ్యవహారంపై అత్యంత కీలకమైన ఆదేశాలు జారీ చేశారు.

టాస్మాక్‌లో సాగుతున్న అనధికారిక నగదు వసూళ్ల వ్యవస్థను తక్షణం రద్దు చేయాలని ఆయన స్పష్టం చేశారు. మద్యం విక్రయాల ద్వారా వచ్చే ప్రతి రూపాయి నేరుగా ప్రభుత్వ ఖజానాకే చేరాలని, టాస్మాక్ హోల్‌సేల్, రిటైల్ నెట్‌వర్క్‌పై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, ఈ అక్రమాలకు పాల్పడిన అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పదవిలోకి వచ్చిన తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే సీఎం విజయ్ ఇంతటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం ఇప్పుడు తమిళనాడు వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# కేటీఆర్ నాలెడ్జ్ ముందు నారా లోకేష్ సరిపోరు

## కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** తెలంగాణ మాజీ మంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి .. తాజాగా ఓ మీడియా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి గురించి మాట్లాడిన కడియం శ్రీహరి.. ఎంతో మంది నాయకులను తయారు చేసినా.. తన కుమారుడు నారా లోకేష్‌ను మాత్రం ఒక గొప్ప లీడర్‌గా తీర్చిదిద్దలేకపోతున్నారని పేర్కొన్నారు. కడియం శ్రీహరి సహా ఎన్నో వందల మంది నేతలను తయారు చేసిన తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు.. తన కుమారుడిని నాయకుడిగా చేసుకోలేరా అని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

నారా లోకేష్‌ను చంద్రబాబు వేలు పట్టి నడిపిస్తున్నాడు, స్పూన్ ఫీడింగ్ చేస్తున్నడు, ఇండిపెండెంట్‌గా పనిచేయలేడు అని ప్రజలకు అనిపిస్తే.. నారా లోకేష్ సక్సెస్ కాలేడు కదా అని కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు ఉన్న అవకాశాలతో తప్పకుండా లోకేష్‌ను ప్రాజెక్ట్ చేస్తారని, ఆ స్థాయికి తీసుకువస్తారని.. అయితే అతడు కూడా తానేంటో నిరూపించుకోవాలి కదా అని పేర్కొన్నారు. అయితే తెలంగాణలో కూడా కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను వేలు పట్టి రాజకీయాల్లో నడిపిస్తున్నారన్న ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కడియం.. తండ్రి పేరుతో రాజకీయాల్లోకి వచ్చినా కేటీఆర్ తన సొంతంగా ఎదిగారని, ఆయనకు ఉన్న నాలెడ్జ్ వేరు అంటూ వెల్లడించారు.

తనకు కొన్ని విషయాల్లో కేటీఆర్‌తో విబేధాలు ఉన్నప్పటికీ.. ఆయనకు ఉన్న నాలెడ్జ్ నారా లోకేష్‌కు లేవని కడియం తెలిపారు. కేటీఆర్ ఈజ్ కేటీఆర్ అని పేర్కొన్నారు. కేటీఆర్‌కు ఉన్న స్కిల్స్, కమ్యూనికేషన్ అడ్వాంటేజ్ ఉందని.. కానీ అవి నారా లోకేష్‌కు లేవని తేల్చి చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి.. లోకేష్‌ను లీడర్‌గా ప్రాజెక్ట్ చేస్తున్నారని కడియం అన్నారు. లోకేష్‌ను చంద్రబాబు వెంటబెట్టుకుని తిరుగుతున్నారని పేర్కొన్నారు. సమావేశాలైతే పక్కన కూర్చొబెట్టుకుంటున్నారని.. ఢిల్లీకి వెళ్తే తన వెంట తీసుకెళ్తున్నారని తెలిపారు.

పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా ఎన్ని రకాలుగా ప్రాజెక్ట్ చేయాలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. కానీ లోకేష్ తండ్రి చాటు కొడుకుగా ఉండకుండా.. తన సమర్థతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని, ఇండిపెండెంట్‌గా వ్యవహరించాల్సి ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు వెంట లోకేష్ మాత్రమే కూర్చోవాలా.. పార్టీలో ఇంకా ఎవరూ సీనియర్లు లేరా అని ప్రశ్నించారు.

# అలా చేయకపోతే తెల్లాపూర్ శాసనానికి

## కట్టేసి రాళ్లతో కొట్టండి: కవిత



**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఉండగా కొత్త పార్టీ అవసరం ఏంటనీ కొంత మంది అడుగుతున్నారని మూడు ప్రధాన పార్టీలు ఉన్నా పేద ప్రజలు చదువుకునేందుకు ఇబ్బంది పడే పరిస్థితి ఎందుకు ఉందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. సర్కార్ స్కూళ్లలో పరిస్థితి ఏ మాత్రం బాగోలేదని చదువుకుంటామని పిల్లలు అడిగితే అవకాశం కల్పించలేని పార్టీలు ఉంటే ఎంత లేకుంటే ఎంత? అని మండిపడ్డారు. ఇవాళ ఒక ప్రమాదం జరిగితే ప్రైవేట్ ఆసుపత్రుల్లో లక్షల్లో ఖర్చు అవుతుందని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తామంటే అక్కడ సూది ఉంటే దూది లేని పరిస్థితి ఉందన్నారు. ఈ బాధలన్నీ ఒక తల్లి మాదిరిగా ఆలోచిస్తేనే అర్థం అవుతాయని మీ ఆడబిడ్డగా నేను ముందుకు వచ్చానన్నారు. ఇవాళ సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన కవిత ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల మీద నమ్మకంతో పార్టీ పెట్టాననని కచ్చితంగా మేము మార్పు తీసుకొస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా టీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అధికారంలోకి వచ్చాక ఉచిత విద్య, ఉచిత వైద్యం ఇవ్వకపోతే తెల్లాపూర్ శాసనానికి కట్టేసి రాళ్లతో కొట్టండని పిలుపునిచ్చారు.


రఘునందన్ నోటికి తాళం ఎందుకు వేసుకున్నారు?:

జహీరాబాద్?కు బుల్లెట్ ట్రైన్ ఇవ్వకపోతే ఎంపీ రఘునందన్ రావు నోరు మెదపటం లేదని కవిత మండిపడ్డారు. అన్నింటికీ నోరు వేసుకొని పడిపోయే రఘునందన్ రావు ఇప్పుడు ఎందుకు నోటి తాళం వేసుకున్నారని నిలదీశారు. బుల్లెట్ ట్రైన్ ఇవ్వని బీజేపీని మిగతా రాజకీయ పార్టీలు ఎందుకు ప్రశ్నించటం లేదని ప్రశ్నించారు. జహీరాబాద్?కు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు మేము కొట్లాడుతామన్నారు. ఎంఎంటీఎస్ ట్రైన్ తెస్తామని పేదవాళ్ల ఇండ్లు తీసుకొని వాళ్లను రోడ్డున పడేశారని కానీ ఇప్పటి వరకు ట్రైన్ రాలేదు. వారికి పరిహారం అందలేదన్నారు. బీజేపీని ప్రశ్నించాల్సిన మిగతా పార్టీలు సైలెంట్ ఉంటాయన్నారు. అన్ని పార్టీల నాయకులు దోచుకుంటూ ప్రజలను ఆగం చేస్తున్నారని ఆరోపించారు. సంగారెడ్డిలో అన్ని పార్టీలకు చెందిన పెద్ద నాయకులు ఉన్నారు. కానీ అందరూ కూడా మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేసే వారేనని కవిత ఆరోపించారు. పటాన్ చెరు ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నారో తెలియదని, సంగారెడ్డి ఎమ్మెల్యే ఒక పార్టీ గెలిచే ఇంకో పార్టీ పనులకు వెళ్తారన్నారు. ఆందోల్ ఎమ్మెల్యేకు మంత్రి పదవి వచ్చిందని సంతోషిద్దామంటే వాళ్ల బావమరిది సింగూర్ ఎఫ్టీఎల్ కింద 2 వంద ఎకరాలు కబ్జా చేశాడని ఆరోపించారు. వీళ్లంతా రాజకీయంగా ఎదిగి, ప్రజలకు మాత్రం ఏమీ చేయటం లేదన్నారు. మేము పాంచజన్యం అనే ఐదు కీలక అంశాలను ప్రాధాన్యంగా పెట్టుకున్నాంమన్నారు. రైతుల కల్లాల దగ్గర గుండెపోటుతో చనిపోతే అడిగే గుండె ధైర్యం ఏ పార్టీకి లేదుని వారికోసం మేము కొట్లాడుతాం. రైతును గౌరవించే జవాబుదారీ ప్రభుత్వాన్ని నడిపిస్తామన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చి సామాజిక న్యాయ తెలంగాణను సాధిస్తామన్నారు. .

మన ప్రాంతాన్ని ప్రేమించే రాజకీయ శక్తి అవసరం:

తెలంగాణ వస్తే పేద బిడ్డలు జేబు చూసుకోవాల్సిన పరిస్థితి రాదని అనుకున్నాం కానీ అలా జరగలేదని పేద ప్రజలు ఇప్పటికీ ఇబ్బందులు పడుతూనే ఉన్నారున్నారు. సింగూరు ప్రాజెక్ట్ 15 ఏళ్లుగా కుంగుతూనే ఉందని ఇరిగేషన్ శాఖ మంత్రిగా హరీష్ రావు ఉన్నప్పటికీ ఒక్క రూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. ఆంధ్రావాళ్లు ఇవ్వలేదంటూ వాళ్లను తిట్టాం. కానీ ఇప్పుడు ఎందుకు మనం బాగు చేసుకోలేదని నిలదీశారు. 2016–2017 లో సింగూర్ ఎండిపోయింది. అప్పుడు బాగు చేసుకునే అవకాశం ఉండేనని ఇప్పుడు నిండా ఉన్న సింగూర్?ను ఆపి రిపేర్ చేసుకునే పరిస్థితి తెచ్చారని దుయ్యబట్టారు. శ్రద్ధ, ప్రేమ లేని కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అందుకే మన ప్రాంతాన్ని ప్రేమించే కొత్త రాజకీయ శక్తి రావాల్సిన అవసరం ఉంది.

# మృగశిర కార్తె.. చేపలకు భలే గిరాకీ



**న్యూస్ డెస్క్, 07 జూన్ (బిఎన్ఎస్):** మృగశిర కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే నమ్మకం పూర్వీకుల కాలం నుంచి కొనసాగుతోంది. ఈ ఆచారాన్ని అనుసరిస్తూ ఆదివారం మృగశిర కార్తె సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున చేపలను కొనుగోలు చేయడంతో మార్కెట్ సందడిగా మారింది. మృగశిర కార్తె ప్రభావంతో చేపల ధరలు సాధారణ రోజుల కంటే పెరిగినప్పటికీ, ప్రజలు ధరలను లెక్కచేయకుండా ఆసక్తిగా కొనుగోలు చేశారు. దీంతో చేపల మార్కెట్లలో రద్దీ నెలకొంది. ఉదయం నుంచే మత్స్యకారులు సమీపంలోని చెరువులు, కుంటల్లో చేపలు పట్టి గ్రామాలు, మార్కెట్ ప్రాంతాల్లో విక్రయించారు. పెరిగిన డిమాండ్ కారణంగా చేపల వ్యాపారం జోరుగా సాగిందని వ్యాపారులు తెలిపారు. మరోవైపు, మృగశిర కార్తె సందర్భంగా సంప్రదాయాన్ని పాటిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి చేపల వంటకాలను ఆస్వాదించేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

# ఒంటిమిట్టలో యోగా పక్షోత్సవాలు



కడపజిల్లా(బిఎన్ఎస్) జూన్ 07: యోగా తోనే సర్వ మానవాళికి ఆరోగ్య యోగం సిద్ధిస్తుందని, దైనందిన జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలని, జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పిలుపునిచ్చారు. జూన్ 21న అంతర్జాతీయ యోగాదినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆదివారం ఒంటిమిట్ట కోదండరామ స్వామి దేవస్థాన ప్రాంగణంలో యోగాంధ్ర పక్షోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేసీ డా.నిధి మీనా తోపాటు రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన హాజరయ్యారు. ఈసందర్భంగా జేసీ డా.నిధి మీనా మాట్లాడుతూ..అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా "యోగా పక్షోత్సవాలు" నేటి నుంచి మొదలైందన్నారు. "యోగాంధ్ర క్యాంపెన్ -2026" లో భాగంగా జూన్ 7వ నుండి జూన్ 21 వరకు నిర్వహిస్తున్న ఈ పక్షోత్సవాల్లో యోగా చేయడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విశదీకరిస్తూ..యోగా పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈరోజు నుంచి జిల్లా యంత్రాంగం,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనాలని కోరారు.

ప్రాచీనకాలం నుండి యోగా సాధనతో ఎందరో మునులు, ఋషులు,యోగులు తపోనిష్ఠ సమయంలో, అనారోగ్యాలు దరిచేరకుండా యోగాసనాలు, ప్రాణాయామాలు చేస్తూ సంపూర్ణఆరోగ్యాన్ని తమ సొంతం చేసుకున్నారని గుర్తు చేశారు.మానసిక సమస్యలకు,శారీరక రుగ్మతలకు యోగ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. సబ్ కలెక్టర్ భావన మాట్లాడుతూ..నేటి ఉరుకులు, పరుగుల జీవనంలో చదువులు, ఇళ్లలో పనులు, ఆఫీసుల్లో ఒత్తిళ్ల కారణంగా ఎంతో మంది అనేక శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను ఎదుర్కొంటున్నారన్నారు. వీటన్నింటినీ జయించి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా మాత్రమే అన్నారు. ఆరోగ్యపరిరక్షణలో భాగంగా రోజులో కొంత సమయాన్ని వ్యాయామం, యోగా,ధ్యానం కోసం కేటాయించాలని కోరారు.

అనంతరం జేసీ,సబ్ కలెక్టర్ యోగాసనాలు వేసి అందరిలోనూ స్ఫూర్తి నింపారు.అలాగే వివిధ శాఖల జిల్లా అధికారులు కూడా జేసీ తోపాటు యోగాసనాలు వేశారు. యోగామాస్టర్ లు ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలను చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో ప్రశాంతి కేఎంసి అదనపు కమిషనర్ రాజేష్ చంద్రం,జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, జిఎస్డబ్ల్యూ జిల్లా అధికారి మైథిలీ,జిల్లా అధికారులు, ఆయుష్ సిబ్బంది,యోగా శిక్షకులు ప్రసాద్ బృందం, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు...

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ రావాలి - హోం మంత్రి అనిత



విజయవాడ,జూన్ 07(బిఎన్ఎస్):- 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 07 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఎన్.టి.ఆర్.పోలీసు కమిషనరేట్ పరిదిలో బి.ఆర్.టి.ఎస్.రోడ్డు వద్ద పోలీసు శాఖలో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి నగర పోలీస్ కమీషనర్ వి. రాజ శేఖర్ బాబు ఆద్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసు యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హోం మంత్రి అనిత హాజరయ్యారు. పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు సుమారు 5000 మంది పాల్గొని యోగాసనాలు అభ్యసించారు.

ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యాన్ని తామే కాపాడుకోవాలనే సంకల్పంతో యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. భారతీయ సంస్కృతిలో వేల ఏళ్ల చరిత్ర కలిగిన యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. 2014లో ఐక్యరాజ్యసమితి వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 150కు పైగా దేశాలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు.

యోగాకు ప్రత్యేక ఖర్చులు అవసరం లేదని, పేదవాడు నుంచి ధనికుడి వరకు ప్రతి ఒక్కరూ కేవలం ఒక మ్యాట్‌తో యోగాను అభ్యసించవచ్చని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, ఆనంద ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# రాపూరు గ్రంథాలయంలో ఘనంగా ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):- స్థానిక శాఖా గ్రంథాలయంలో గత కొన్ని రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ ముగింపు సభకు విద్యార్థులు, పాఠకులు, స్థానిక వర్తకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంటూ పుస్తక పఠనం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయాలు విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టే విజ్ఞాన గనులని, పుస్తకాలను స్నేహితుడిగా చేసుకున్నవారే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. క్యాంప్ ముగిసినప్పటికీ విద్యార్థులు వారానికి ఒక్కసారైనా గ్రంథాలయాన్ని సందర్శించి కథలు, జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని హితవు పలికారు, వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్, వ్యాసరచన, కథలు చెప్పడం వంటి పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజయ్య, ప్రధానోపాధ్యాయులు కోలా వెంకట నాగేశ్వరరావు, ఎస్.ఆర్. పంతులు, జూనియర్ కళాశాల లెక్చరర్ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన, అప్రమత్తత తప్పనిసరి...

### బీఎల్ఎలు బాధ్యతగా వ్యవహరించాలి...




రావులపాలెం (బిఎన్ఎస్) జూన్ :7ఎన్నికల కమిషన్ చేపట్టిన సర్ ( ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమంపై ప్రతి నాయకుడు, కార్యకర్త, ప్రధానంగా బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం రావులపాలెం కాపు కళ్యాణ మండపం వద్ద ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు, ప్రధాన కమిటీ సభ్యులు, అనుబంధ కమిటీల సభ్యులకు సర్ పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 15 వరకు క్షేత్రస్థాయిలో సర్ సర్వే జరుగుతుందని.. ఈ సమయంలో నియోజకవర్గ పరిధిలోని 262 బూత్ లకు సంబంధించిన బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ లిస్టులను పరిశీలించి అర్హులైన వాటర్ల నమోదుపై దృష్టి సారించాలని కోరారు. ప్రతిఒక్క ఓటరు చేత ఫారం-2 సక్రమంగా పూర్తి చేయించి సమర్పించాలన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఓట్లు తొలగించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జులు, కో ఇన్చార్జిలు, యూనిట్ ఇంచార్జిలు, యూనిట్ కో ఇన్చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# లింగమనేని రమేష్ కు...శుభాకాంక్షలు తెలిపిన వేగుళ్ళ లీలాకృష్ణ



విజయవాడ (బిఎన్ఎస్)జూన్ 7: గెలుపుఓటములతో సంబంధం లేకుండా గత పదిహేను సంవత్సరాలుగా పవన్ కళ్యాణ్ వెన్నంటి నిలుస్తూ పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్న నిబద్ధత కలిగిన నాయకుడన్నారు రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ.రాజ్యసభకు జనసేన పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన లింగమనేని రమేష్ కు విజయవాడలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా ఆయనకు తన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం లీలాకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ కష్టకాలంలో అండగా నిలిచిన నాయకుల్లో లింగమనేని రమేష్ ఒకరని పేర్కొన్నారు. రాజ్యసభ అభ్యర్థిగా ఆయన ఎంపిక కావడం పార్టీ శ్రేణులందరికీ ఆనందదాయక విషయమని తెలిపారు.రాబోయే రోజుల్లో పార్లమెంట్ వేదికగా ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావించి రాష్ట్ర ప్రయోజనాల సాధనకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి రూ. 10 వేలు విరాళం ఇచ్చిన డాక్టర్ చల్లా.



ఆలమూరు (బిఎన్ఎస్ )జూన్ :7 రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలోని కె గంగవరం మండలం సత్యవాడలో ఈ నెల 24న 45 అడుగుల శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. ఈ మహోన్నతమైన దైవ కార్యక్రమంనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐక్య కాపునాడు ట్రెజరర్, కోనసీమ జిల్లా కాపు సంఘం అధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త, జాతీయ సేవా పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు వారి స్వగృహంలో ఆలయ కమిటీ వార్కి ప్రముఖ న్యాయవాది సలాది సత్యనారాయణ మూర్తి వారి సమక్షంలో డాక్టర్ చల్లా రూ. 10 వేలు విరాళం అందించారు. తన గ్రామం, మండలం, నియోజకవర్గం కాకుండా ఏ నియోజకవర్గ పరిధిలో వారికైన దానాలు, విరాళాలు, చందాలు ఇవ్వడంలో డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు కి ఎవరు సాటిరారని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించి డాక్టర్ చల్లా ను అభినందించారు.

# మారుతున్న జీవనశైలితోనే గుండె జబ్బులు

### ప్రముఖ కార్డియాలిస్ట్ డాక్టర్ అభిషేక్ వర్మ



అమలాపురం (బిఎన్ఎస్)జూన్:7 మారుతున్న జీవనశైలి, మానసిక ఒత్తిడి, సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం వల్ల ప్రస్తుత కాలంలో గుండె జబ్బుల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు కార్డియాలిస్ట్ డాక్టర్ అభిషేక్ వర్మ.అమలాపురం ఎస్.కే.బీ.ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈరోజు ఉదయం వాకర్స్ హెల్త్ క్లబ్ జనరల్ బాడీ సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. క్లబ్ అధ్యక్షులు ఉపుగంటి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రముఖ కార్డియాలిస్ట్ (గుండె జబ్బుల నిపుణులు) డాక్టర్ అభిషేక్ వర్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి డాక్టర్ అభిషేక్ వర్మ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజూ ఉదయం వాకింగ్ (నడక) చేయడంతో పాటు, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని సూచించారు. గుండె జబ్బుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, ప్రాథమిక లక్షణాలను గుర్తించి ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులు అడిగిన పలు సందేహాలకు ఆయన నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కుడుపూడి త్రినాథరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ పి.ఎస్. శర్మ, డాక్టర్ సి.హెచ్. విష్ణుమూర్తి, క్లబ్ ప్రతినిధులు బోణం సత్య వరప్రసాద్, గుర్రం రామకృష్ణ, నూకల సత్యనారాయణ, తేతల సత్యనారాయణరెడ్డి, సప్పా నాగేశ్వరరావు, పుత్సా కామేశ్వరరావు, గోటేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగు మహాసభల్లో కొత్తపేట కళాసాహితి కవులు




రాజమహేంద్రవరం, బిఎన్ఎస్: రాజమహేంద్రవరంలో గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఛాన్సలర్ కె వి వి సత్యనారాయణ రాజు, అంతర్జాతీయ శ్రీ శ్రీ కళా వేదిక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ సంయుక్త నిర్వహణలో జూన్ 6, 7 తారీకులు జరుపు తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభలకు మొదటి రోజున కొత్తపేట కళాసాహితి తరఫున అద్దంకి బుద్ధ చంద్ర దేవ్, జినిపే భీమారావు, ఖాజా మొహిద్దీన్, ముషిణి సురేష్, కోటిపల్లి రామకృష్ణ, పోలిశెట్టి మాచర రావు కవితా పఠన విభాగానికి హాజరై తమ కవితలు వినిపించారు.

పుస్తకావిష్కరణల విభాగంలో అద్దంకి బుద్ధ చంద్రదేవ్ రాసిన బుద్ధ శోధన – జ్ఞాన సాధన" (దీర్ఘ కవిత), "పర్యావరణ పరిరక్షకులందరూ బౌద్ధులే!" (పరిశోధనా వ్యాసం) " లేత హృదయాల్లో బుద్ధోదయం ఎలా?" ( సమాలోచన ) అన్న బహు విషయ గ్రంథాన్ని జిజియు చాన్స్ లర్ చైతన్య రాజు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, ఏపీ రక్షణ దళం కమాండెంట్ కొండా నరసింహారావు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు, ప్రముఖ సాహితీవేత్త ఎర్ర ప్రగడ రామకృష్ణ, శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు శ్రీమతి జి ఈశ్వరి భూషణం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి పార్థసారథి తదితరులు హాజరయ్యారు. వేదికనలంకరించిన పెద్దలకు వేదిక ముందున్న ఆహుతులకు, బుద్ధ చంద్రదేవ్ తన బుద్ధ శోధన పుస్తకాన్ని పంచారు.

# చింతకాయల విజయ్‌కు బిగ్ ప్రమోషన్!

### తెలుగు తమ్ముళ్ల ఆనందానికి అవధుల్లేవు!



బిఎన్ఎస్: టీడీపీ సీనియర్ నేత చింతకాయల విజయ్‌కు రాజ్యసభ సభ్యత్వం ఖరారవడంతో అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో తెలుగు తమ్ముళ్ల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. పార్టీ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహిస్తూ తమ హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కార్యకర్తలు ఒకరికి ఒకరు స్వీట్లు తినిపించుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అంతేకాకుండా భారీ బాణసంచా కాల్చి విజయోత్సవ వాతావరణాన్ని సృష్టించారు.

చింతకాయల విజయ్‌కు రాజ్యసభ సీటు కేటాయించడంపై పార్టీ నాయకులు, అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో పనిచేసిన నాయకుడికి తగిన గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. అలాగే ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంబరాల్లో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయ్‌కు మద్దతు తెలుపుతూ సందడి చేశారు.

# తెదేపా కార్యకర్త చంగయ్య మృతి

### మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన రాపూరు పట్టణ అధ్యక్షులు కోటినాయుడు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):- నెల్లూరు జిల్లా రాపూరు మండలం రాపూరు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీల కార్యకర్త ఆముదాల చంగయ్య అకాల మరణం చెందడం పట్ల స్థానిక నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చంగయ్య మరణవార్త తెలుసుకున్న రాపూరు పట్టణ అధ్యక్షులు ఏదోటి కోటినాయుడు వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు... రాపూరు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు కోటి నాయుడు వెంటనే ఆయన నివాసానికి చేరుకున్నారు. చంగయ్య భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు ఎల్లప్పుడూ ఆదుకుంటారని, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ... తన వంతుగా ఆ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం కోటి నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే

కురుగొండ్ల రామకృష్ణ సూచనల మేరకు చంగయ్య కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది అని పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను కోల్పోవడం బాధాకరం. చంగయ్య కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది అని కోటి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కోటి నాయుడు వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు సంకల పాపయ్య, గజరా కిరణ్, విజయ్ మరియు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాపూరు నూతన యంపీడిఓ గా వసుందరమ్మ బాధ్యతలు



నెల్లూరు జిల్లా రాపూరు (బిఎన్ఎస్):–నెల్లూరు జిల్లా రాపూరు యంపీడిఓగా ఉన్నా యం.భవాని ఇటీవల పదవీ విరమణ చేసింది. ఆమె స్థానంలో రాపూరు యం.పీ.డి.ఓ.గా పి.వసుందరమ్మ పదోన్నతిపై ఆదివారం బాధ్యతలు చేపట్టారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పి.జి.ఆర్.ఎస్‌ను వినియోగించుకోండి: కలెక్టర్



గుంటూరు, జూన్ 7(బిఎన్ఎస్) : గుంటూరు జిల్లా గుంటూరు సిటీ : మీకోసం వెబ్ సైట్ లో పి.జి.ఆర్.ఎస్ అర్జీలు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ను ప్రాధాన్యతతో చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 1100 ఏర్పాటు చేసి అర్జీల పరిస్థితి తెలుసుకునే ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు తమ దరఖాస్తులను పి.జి.ఆర్.ఎస్ తో పాటు “మీకోసం” వెబ్ సైట్ లో ఆన్ లైన్ లోను సమర్పించవచ్చని తెలిపారు. అర్జీల వివరాలు Meekosam.ap.gov.in వెబ్సైట్ లో నమోదు చేసుకోవచ్చని చెప్పారు. పి.జి.ఆర్.ఎస్ తో పాటు నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మామిడి సోమయ్య కు జన్మదిన శుభాకాంక్షలు

**•టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కరిమిళ్ల దుర్గారావు**

**బిఎన్ఎస్న్యూస్ పర్వతగిరి/ జూన్7**



వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మామిడి సోమయ్య 61వ జన్మదినం సందర్భంగా వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కరిమిళ్ల దుర్గారావు శుభాకాంక్షలు తెలిపారు.డాక్టర్ మామిడి సోమయ్య

జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాడుతూ వారి హక్కుల సాధనకై నిరంతరం తెలంగాణ ఏర్పాటులో సైతం జర్నలిస్టుల వాలిని అప్పటి ప్రభుత్వాలకు కళ్ళు తెరిపించి తెలంగాణ జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన కృషిని ముందు వరుసలో నిలిపిన మామిడి సోమయ్య జర్నలిస్టు సమాజం మరువదనిఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు కరిమిళ్ల దుర్గారావు అన్నారు. భవిష్యత్తులో కూడా నిత్య నూతనంగా వారి సేవలు జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ఆంధ్రజ్యోతి సీనియర్ విలేకరి శ్రీరాం రమేష్‌కు ఘన నివాళులు

**దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు**

**బిఎన్ఎస్న్యూస్ వర్ధన్నపేట /జూన్ 7**



వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండల కేంద్రానికి చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ పత్రిక విలేకరి శ్రీరాం రమేష్ దశదిన కర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొని,శ్రీరాం రమేష్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. జర్నలిస్టుగా సమాజానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సెల్ అధ్యక్షులు బొంపల్లి దేవేందర్ రావు, పట్టణ నాయకులు పులి శ్రీనివాస్అన్వర్ వెంకట్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# ఏ అంశం మీద చర్చ పెట్టినా సిద్ధమే..: సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్: ఏ అంశం మీద ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమేనని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. పొలిమేరకు రాకుండా తనను ఆపేవారు తెలంగాణలో ఇంకా పుట్టలేదని వ్యాఖ్యానించారు. “రేవంత్‌రెడ్డిలా నేను పది పార్టీలు మారలేదు. నా పుట్టుక.. చావు.. రెండూ భాజపాలోనే. నేనేంటో తెలంగాణ ప్రజలకు తెలుసు. ఎంత రెచ్చగొట్టినా తొందరపడను. అన్నింటికీ సమయమే సమాధానం చెబుతుంది. ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి. దళితులు, బీసీలు మీ ఇంటికి వచ్చి ధర్నాలు చేస్తారు” అని కిషన్‌రెడ్డి అన్నారు.

# వేమగిరికి అభివృద్ధి వరాలు

**రూ.70 లక్షల ఆర్అండ్‌బీ రహదారి ప్రారంభం**
**తులసి కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన హోంమంత్రి అనిత**
**రామాలయ అభివృద్ధికి రూ.40 లక్షల నిధులు**



అనకాపల్లి జిల్లా,ఎస్.రాయవరం, జూన్ 7: పాయకరావుపేట నియోజకవర్గంలోని వేమగిరి గ్రామానికి అభివృద్ధి వరాలు అందుతున్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.



ఎస్.రాయవరం మండలం వేమగిరి గ్రామంలో ఆదివారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులతో ఆహ్వానించి ఆత్మీయంగా స్వాగతించారు.

పర్యటనలో భాగంగా మంత్రి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాబార్డ్ నిధులతో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన ధర్మవరం--ఎలమంచిలి ఆర్అండ్‌బీ రహదారిని ప్రారంభించారు. అలాగే విశాఖ డెయిరీ సహకారంతో నిర్మించిన శ్రీ తులసి కళ్యాణ మండపాన్ని ప్రజలకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలుపొందిన తాను నియోజకవర్గ అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచి సేవాభావంతో పనిచేసిన ఆడారి తులసిరావు సేవలను గుర్తు చేసుకున్నారు. విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, పాయకరావుపేట నియోజకవర్గంలోనూ అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేమగిరిలో రూ.70 లక్షలతో రహదారి నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామంలోని రామాలయ అభివృద్ధికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అడ్డురోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల ఉపమాక ఆలయంలో జరిగిన చోరీ ఘటనలోక కేవలం రెండు రోజుల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసు అధికారులను మంత్రి అభినందించారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, విశాఖ డెయిరీ ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ం

# సామాన్యుడికి మళ్లీ షాక్..! పెరిగిన వంట గ్యాస్ ధర -- రూ.29 అదనపు భారం

**బిఎన్ఎస్న్యూస్, పర్వతగిరి/ జూన్ 7**




ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు,ఇంధన ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య ప్రజలకు కేంద్ర ప్రభుత్వం మరోసారి షాక్ ఇచ్చింది. గృహ వినియోగ ఎల్పీజీ (వంట గ్యాస్) సిలిండర్ ధరను రూ.29 మేర పెంచుతూ ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు ఈ రోజు (జూన్ 7) నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తాయని అధికారులు వెల్లడించారు.

దేశవ్యాప్తంగా 14.2 కిలోల గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లపై ఈ ధరల పెంపు వర్తించనుంది. తాజా పెంపుతో దేశంలోని పలు నగరాల్లో ఎల్పీజీ ధరలు పెరిగాయి. స్థానిక పన్నులు, రవాణా ఖర్చుల ఆధారంగా రాష్ట్రాల వారీగా ధరల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని అధికారులు తెలిపారు.

గత మూడు నెలల వ్యవధిలో ఇది రెండోసారి వంట గ్యాస్ ధరలు పెరగడం గమనార్హం. ఈ ఏడాది మార్చి నెలలో కూడా గ్యాస్ ధరలు పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి రూ.29 పెరగడంతో కుటుంబాల నెలవారీ ఖర్చులపై అదనపు భారం పడనుంది. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్‌పై ఈ ప్రభావం స్పష్టంగా కనిపించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికే కూరగాయలు, సరుకుల ధరలు పెరగడం, విద్యా ఖర్చులు, వైద్య వ్యయం, పెట్రోల్–డీజిల్ ధరల ప్రభావంతో సామాన్యుడి జీవితం భారంగా మారిన వేళ వంట గ్యాస్ ధర పెరగడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. వంటింటి ఖర్చులు మరింత పెరగనున్నాయనే ఆందోళన కుటుంబాల్లో వ్యక్తమవుతోంది.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, దిగుమతి వ్యయాల పెరుగుదల, చమురు సంస్థల ఆర్థిక పరిస్థితుల కారణంగానే గ్యాస్ ధరలను సవరించినట్లు చమురు సంస్థలు పేర్కొంటున్నాయి. అయితే ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉపశమన ప్రకటన వెలువడకపోవడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా వంట గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉంది. ప్రాంతాల వారీగా స్థానిక పన్నులు, రవాణా ఛార్జీల ఆధారంగా ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ రోజు నుంచే అమల్లోకి వచ్చిన తాజా పెంపుతో సామాన్య కుటుంబాలకు వంట గ్యాస్ కొనుగోలు మరింత భారంగా మారనుంది.

# నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పీడీ యాక్ట్ ను నమోదు చేయాలి

**నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టాలి**
**మాజీ పర్వతగిరి రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్**

**బిఎన్ఎస్న్యూస్,పర్వతగిరి/జూన్ 7**



వరంగల్ జిల్లా:ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఈ సమయంలో వివిధ రకాల కంపెనీల పేర్లతో గ్రామాల్లో పర్వతగిరి కేంద్రంలో రైతులకు విత్తనాలు అందజేస్తామని చెప్పి నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదం పొంచి ఉన్నదని దీనిని గుర్తించి ముందుగానే విత్తనాలు అమ్మే షాపులపై నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ,మాజీ పర్వతగిరి మండల రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్ ఆదివారం పత్రిక ప్రకటనలో తెలిపారు.

విత్తనాల తయారీలో బడా కార్పొరేట్ సంస్థలు సామ్రాజ్యాగ సంస్థలు ఆదిపత్యం చెలాయిస్తున్నాయని రైతులకు విత్తనాలు వాతావరణ అనుకూలంగా లేనటువంటి విత్తనాలు అంటగట్టి లాభాలు పొందుతున్నాయని ప్రభుత్వం ఇటువంటి సంస్థలపై నిఘా పెట్టి రైతుకు నష్టం జరగకుండా చూడాలని వారు కోరారు.

పెరుగుతున్న ఎరువులు డీఏపీ రకరకాల క్రిమిసంహారక మందులు ధరలు ఇప్పటికే 50% గా పెరిగాయని వెంటనే అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.పర్వతగిరి మండలం లో గత ఖరీఫ్ –రబీ సీజన్లో కొన్ని గ్రామాలలో రైతులకు ఎరువుల దుకాణం యాజమాన్యం స్వంత లాభం కోసం నకిలీ నకిలీ విత్తనాలు అమ్మటం వలన నష్ట పోయారని తెలిపారు. అలాంటి చర్యలు జరగకుండా మండల వ్యవసాయ అధికారులు , జిల్లా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని చిన్నపాక శ్రీనివాస్ అధికారులను కోరారు.

యూరియా ముందుగా కేంద్ర ప్రభుత్వం తో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించి కేంద్రం నుండి తీసుకొని వచ్చి రాష్టంలో గోదాములలో దిగుమతి చేయాలని కోరారు.

కేసీఆర్ ప్రభుత్వంలో యూరియా అందుబాటులో ఉండేది ఇప్పుడు ఉన్న ప్రభుత్వం వచ్చాక యూరియా కొరత ఏర్పడడంతో రైతుల తీవ్రత ఆందోళన చెందారు గతంలో దృష్టిలో పెట్టుకొని ముందస్తు యూరియా కొరత లేకుండా అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోగలరని చిన్నపాక శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

యూరియా ముందుగా కేంద్ర ప్రభుత్వం తో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదించి కేంద్రం నుండి తీసుకొని వచ్చి రాష్టంలో గోదాములలో దిగుమతి చేయాలని కోరారు.

కేసీఆర్ ప్రభుత్వంలో యూరియాఅందుబాటులో

ఉండేది ఇప్పుడు ఉన్న ప్రభుత్వం వచ్చాక యూరియా కొరత ఏర్పడడంతో రైతుల తీవ్రత ఆందోళన చెందారు గతంలో దృష్టిలో పెట్టుకొని ముందస్తు యూరియా కొరత లేకుండా అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోగలరని చిన్నపాక శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

# వరంగల్‌లో 12 కిలోల గంజాయి స్వాధీనం -- ఇద్దరు మహిళలు అరెస్ట్

**బిఎన్ఎస్న్యూస్ వరంగల్, జూన్ 7**




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా మట్వాడ పోలీస్ స్టేషన్ సిబ్బంది 12 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం హంటర్ రోడ్డులోని ఏడు మోరీల జంక్షన్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రెండు సూట్‌కేసులతో అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు మహిళలను గుర్తించారు.పోలీసు వాహనాన్ని గమనించిన వారు పారిపోవడానికి ప్రయత్నించగా వెంటాడి పట్టుకొని విచారించారు.అరెస్టయిన మహిళలను మహారాష్ట్ర రాష్ట్రంలోని పూణేకు చెందిన త్రివేణి రామనాథ్ ఘోడ్కే (26), అంజలి రామ్ సాథే (25)గా గుర్తించారు.

పై అధికారుల ఆదేశాల మేరకు పంచులు, క్లూస్ టీం సిబ్బంది సమక్షంలో వారి వద్ద ఉన్న రెండు సూట్‌కేసులను తనిఖీ చేయగా ఆరు ప్యాకెట్లలో నిల్వ ఉంచిన 12 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఒక్కో ప్యాకెట్ సుమారు 2 కిలోల బరువు ఉండగా, మొత్తం గంజాయిని స్వాధీనం చేసుకొని నమూనాలు సేకరించి సీజ్ ప్రక్రియ పూర్తి చేశారు.విచారణలో నిందితురాళ్లు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ ప్రాంతానికి చెందిన బీజేష్ వ్యవన్ అలియాస్ సోనీ అలియాస్ మానిష్ సహూ వద్ద రూ.60 వేల చెల్లించి గంజాయి కొనుగోలు చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.గంజాయిని పూణేకు తరలించే క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు జరుగుతున్నాయని గుర్తించి రైలు నుంచి దిగి, వెనుక మార్గం ద్వారా కాజీపేట వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారని వెల్లడించారు.నిందితురాళ్ల వద్ద నుంచి గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీం సంఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సేకరించింది.స్వాధీనం చేసుకున్న 12 కిలోల ఎండు గంజాయి మార్కెట్ విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వ మరియు వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలకు సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100/112కు తెలియజేయాలని వరంగల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.